
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## అధికారులు మళ్లీ సతాయిస్తరు..

ధర్మారం చెరువు మొకాన మాకు రెండెకురాలు పొలం ఉంది.. గప్పట్ల మా ఊరి రైతు అడితం రాజయ్య భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు సాక్షి సంతకం కోసం హుజూరాబాద్ పోయిన.. అప్పుడు ఓసారి వోయి చలాన్ కట్టి వచ్చినం.. ఓ సారి పేపర్లు రడీ చేపిచ్చెటానికి పోయినం.. మల్లా ఓసారి రిజిస్ట్రేషన్ అయిన రోజు వోయినం.. అన్నీ అయినంక మల్లవోతె వాళ్లు అడిగిన పైసలు ముట్టజెపితెనే కాయితాలు చేతిలపెట్టిన్రు.. ఇగ అప్పట్ల పట్వారీలు కూడా సతాయించెటోళ్లె.. అప్పటి లెక్కలే వేరుండె.. ఏమాటకు ఆ మాట చెప్పుకోవాలి గాని ఇప్పుడు ధరణి వచ్చినంక రైతులకు అలుకగైంది.. స్లాట్ బుక్ చేసుకొని ఎమ్మార్వో ఆఫీసుకు పోతె అప్పటికప్పుడే పని అయితంది.. వేలి ముద్ర వేయించుకుని ఫొటోగొట్టి అప్పటికప్పుడే పాసు బుక్కుల ఎక్కిత్తన్రు.. సతాయింపులు తప్పినయ్.. ధరణి వచ్చినంక కొందరి భూములు గవర్నమెంట్ భూముల కింద ఎక్కినయ్.. గట్లాంటి పొరపాట్లను మాత్రం సరిదిద్దాలె..

**-దేవునూరి శ్రీనివాస్, రైతు, కన్నాపూర్ (శంకరపట్నం)**

## రైతులను ముప్పతిప్పలు పెడుతరు



సమైక్య పాలనలో పాత రెవెన్యూ చట్టాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెట్టిన్రు భూసమస్యలపై వీఆర్ఏలను కలిస్తే వేల రూపాయలు లంచాలు తీసుకుని పని చేయకుండా సతాయించెటోళ్లు. సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణితో ఎంతోమందికి మేలు జరిగింది. అది తీసేస్తే మేమంతా మళ్లీ కష్టాలు పడుతం. కాంగ్రెస్ నాయకులకు మేం బాగుపడడం ఇష్టం లేదు. అందుకే ధరణిని తీసేస్తమని చెబుతున్నరు. కొత్తది వస్తే రైతులు తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిందే. పటేల్, పట్వారీ వ్యవస్థతో భూములు తారుమారయ్యే ప్రమాదం ఉంది. లంచాలివ్వకపోతే అధికారులు పని చేసే పరిస్థితి ఉండదు. రైతులకు చిన్న పహాణీ నకలు కావాలన్నా రెవెన్యూ ఆఫీసుల చుట్టూ నెలల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వస్తది. గతంల ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరుపై రాసెటోళ్లు. రైతుల నడ్డివిరిచేందుకే ధరణిని తీసేస్తమంటున్నరు. కేసీఆర్ సారు ధరణి పోర్టల్ తెచ్చి భూములకు భద్రత కల్పించిన్రు. ఆయనకే మా మద్దతు.

**- బొమ్మకంటి నర్సయ్య రైతు, వెలిచాల, రామడుగు మండలం(చొప్పదండి)**

## ఆఫీసుల చుట్టూ తిరుగుడైతది..



ధరణిని రద్దు చేస్తే రైతులు తాసిల్ ఆఫీసుల చుట్టు తిరుగుడే తిరుగుడే ఉంటది. ధరణిని తీసేస్తే పటేల్, పట్వారీ వ్యవస్త వస్తది. మళ్లీ బ్రోకర్లు పుట్టుకొస్తారు. ఇప్పుడు ఉన్న ధరణితో సమస్యలు తొలగిపోయాయి. ధరణిని తీసేసీ, భూమతాను కాంగ్రెస్ నాయకులు తీసుకువస్తే, కాంగ్రెస్ నాయకులే బ్రోకర్లు అవతారమెత్తుతారు. ధరణితో పట్టదారు పుస్తకాలు, వెంటనే మ్యూటేషన్ అయి ఇస్తున్నరు. ఆనాడు పట్వర్ల చుట్టూ తిరుగుడూ, ఏమన్న జేబు వాటం ఇస్తేనే పని అయ్యేది. ధరణి తీసేస్తే మళ్లీ రైతులు ఆగం కావల్సిన పరిస్థితి వస్తుంది. ధరణి వచ్చినంకనే అక్రమాలు తగ్గి, రిజిస్ట్రేషన్ సులభతరం అయ్యాయి. రైతు వేలి ముద్రలు లేకుండా పట్టా మారదు. నాడు భూమి కొని విక్రయదారుని చుట్టూ, పెద్ద మనుషుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. చివరికి మ్యూటేషన్ కావాలంటే పట్వారిలకి ఎంతో కొంత సమర్పించుకోవాల్సి వచ్చేది. ధరణితో రైతుల కష్టాలు తీరాయి. కొన్ని చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని కూడా త్వరలే పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు తీసుకుంటుంది కదా.

**-కాసం రాజ గోపాల్ రెడ్డి, రైతు, ముంజంపల్లి(మానకొండూర్ రూరల్)**

# పైరవీకారుల రాజ్యమే..

- కాంగ్రెస్‌కు ఓటేస్తే భూములకు రక్షణ కరువే
- లంచావతారులు పీడించుకతింటరు
- ఆఫీసుల చుట్టూ తిప్పతరు
- మండిపడుతున్న అన్నదాతలు

కరీంనగర్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భూముల రక్షణ కోసం సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణిని తొలగిస్తే పైరవీకారుల రాజ్యం వస్తుందని, తమ పరిస్థితి అధోగతే అవుతుందని జిల్లా రైతులు వాపోతున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధిస్తున్నాయని అంటున్నారు. తప్పి పోయి కాంగ్రెస్ పార్టీ వస్తే తమ భూములకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగానే తమ భూములు పైరవీకారుల వ్యవస్థ పరిధిలోకి వెళ్తాయని చెబుతున్నారు. భూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ధరణి ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు తమ భూముల భద్రతపై అనేక అనుమానాలు ఉండేవని, సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణితో తమ భూములకు పూర్తి భద్రత ఏర్పడిందని అంటున్నారు. తమ భూములకు రక్షణగా ఉన్న ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్ నాయకులు రద్దు చేసే ఆలోచనలో ఉన్నారని, ఆ పార్టీకి చెందిన ఒక్కో నాయకుడు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. భూములను రక్షించుకోవాలన్నా, ధరణిని కొనసాగించాలన్నా బీఆర్ఎస్‌నే గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ముక్తకంఠంతో నొక్కి చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను తీవ్రమైన గందర గోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని, ఎవరి మాటల్లోనూ స్పష్టత లేదని, కానీ తమకు మాత్రం ఓటు ఎవరికి వెయ్యాలో చాలా స్పష్టత ఉన్నదని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు.

## ధరణి రద్దయితే దళారుల రాజ్యమే...

కాంగ్రెస్ ధరణి తీసేసి మళ్లీ పాత విధానం తీసుకువస్తే రైతులకు ఇబ్బందులు తప్పవు. దళారుల వ్యవస్థ పుట్టుకొస్తది. ఇంతకుముందు వీఆర్వో, వీఆర్ఏలు ఉన్నప్పుడు తాసిల్దార్ కార్యాలయానికి వెళ్తే పైసా లేకుండా పనులు జరిగేవి కావు. పాస్‌బుక్, మ్యుటేషన్ల కోసం తిరిగి తిరిగి యాష్టకు వచ్చేది. ధరణి వచ్చినంక ఇప్పుడు అలాంటి సమస్యల్లేవు. నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు అయితున్నయ్. పాసుబుక్కులు ఇంటికి వస్తున్నయ్. ధరణి తీసివేస్తామన్న పార్టీలు అధికారంలోకి వచ్చేది ఉందా.. సచ్చేది ఉందా... మేమంతా కేసీఆర్ వెంటే ఉంటాం. ధరణి వచ్చినంక భూమికి భద్రత కల్పించిండు. రైతు బీమా తీసుకువచ్చిండు. వడ్లు కొనుగోలు చేసి నేరుగా డబ్బులు మన అకౌంట్లో వేస్తున్నడు.

**-గాదె రఘునాథ రెడ్డి, రైతు, గునుకులపల్లె, (చిగురుమామిడి)**



## ధరణి తీసేస్తే రైతులు ఆగమైతరు



ధరణి తీసేస్తే రైతులు ఆగమైతరు. ధరణితోనే భూములకు భద్రత వచ్చింది. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో కూడిన రెవెన్యూ విధానం ఉండడం వల్ల రైతులు అనేక కష్టాలు పడ్డారు. వారికి తెలియకుండానే రికార్డుల్లో పేరు మార్పిడి చేసే వారు. దీంతో రైతు తన పేర మార్పు చేసుకోవడానికి పటేల్, పట్వారీ, తహసీల్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పని అయ్యేది కాదు. రెవెన్యూ వ్యవస్థ ఉన్న సమయంలో బలం ఉన్నోనిదే రాజ్యం. రెవెన్యూ రికార్డుల్లో కౌలుదారు, అనుభవదారు కాలం మళ్లీ పెడుతామని కాంగ్రెస్ అంటున్నది. అసలు వారు మతి ఉండే మాట్లాడుతున్నారా. పాతకాలం చట్టాలను పట్టుకొని ఆ పార్టీ వేలాడుతున్నది. ధరణి వచ్చిన తర్వాత రైతుల భూములకు భద్రత ఏర్పడింది. మళ్లీ పాత విధానం తెస్తే రైతుల మధ్య గొడవలు జరుగడంతోపాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. కాంగ్రెస్ నాయకులు సోయి తప్పి మాట్లాడుతున్నరు.

**-మరిమడ్ల మల్లయ్య, రైతు, చొప్పదండి**

## భూములకు భద్రత ఉండదు..

నాకు రెండు ఎకరాలు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజుల్లో రెవెన్యు శాఖలో తహసీల్దార్ మొదలుకొని కింది స్థాయిలోని వీఆర్వోల వరకు అందరూ లంచాలకు మరిగి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. కొందరి రైతుల భూములను అన్నదమ్ముండ్లు, పాలివాళ్లకు, పెత్తందారుల పేర్ల మీద చేసి కొట్లాటలు పెట్టే వారు. దీంతో చాలా వరకు కేసులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరేగే పరిస్థితి ఉండేది. వీటి వల్ల రైతులు అప్పులు చేసుకొని ఆఖరికి భూములు కూడా అమ్ముకొనే పరిస్థితి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి యాప్‌తో ఆ బాధలు చాలా వరకు తగ్గిపోయాయి. దాంతోనే మా భూములకు భద్రత ఏర్పడింది. మా తండ్రి నుంచి అన్నదమ్ములకు భూమార్పిడి ధరణితో క్షణాల్లో జరిగింది. నాకు ఉన్న రెండు ఎకరాల్లో ఎలాంటి గొడవలు లేకుండా సాగు చేసుకుంటున్నామంటే అది సీఎం కేసీఆర్ చొరవతోనే. అలాంటి ఆయనకు నేను, నా కుటుంబం మొత్తం ఈ ఎన్నికల్లో అండగా ఉంటాం.

**- మాసాడి రమేశ్‌రావు, రైతు, సిర్సపల్లి (హుజూరాబాద్‌టౌన్)**



## కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

నాడు మా భూములను కాపాడుకునేందుకు పడ్డ గోస మర్చిపోలె. పాత పద్ధతి రికార్డులతో మేము పడ్డ బాధలు ఇంకెవ్వలు పడలేదు. సీఎం కేసీఆర్ సార్ కొత్తగా తెచ్చిన ధరణితోనే మా భూములు మాకు పాసుబుక్కుల్లో ఎక్కినయ్. మా పేరు మీది నుంచి మాకొడుకులకు పది నిమిషాల్లోనే రిజిష్టర్ చేసినం. మా కొడుకులకు పాసుబుక్కులు కూడా వచ్చినయ్. రైతు బంధు కూడా పడుతంది. మళ్ల పాత పద్ధతే వస్తే కనుక ఇగ మా అసొంటి పేద రైతులకు మళ్లా కష్టాలు మొదలైనట్లే. కాయితాల కోసం కార్యాలయాల చుట్టూ రోజులకు రోజులు తిరగాలే. పట్టా కోసం వారాల తరబడి ఆఫీసులల్ల పడిగాపులు కాయాలే. ధరణి రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాలకు రానీయ్యకుండా తరమికొట్టాలి. పేద రైతుల కోసం కష్టపడుతున్న సీఎం కేసీఆర్‌నే మళ్లా గెలిపించుకుందాం. భూముల పంచాయితీలు లేకుంట తుర్తిగా ఇళ్లల్ల ఉందాం.

**- లచ్చవ్వ, మహిళా రైతు, మొగ్దుంపూర్, కలెక్టరేట్**

